



వేడుకగా రథోత్సవం

వల్లూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఉదయం శివపార్వతులకు, సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవులకు రథోత్సవం వైభవంగా నిర్వహించారు. కామాక్షి సమేత వైద్యనాథేశ్వర, రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ స్వామివార్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయాన సుప్రభాత పూజలు నిర్వహించిన అనంతరం వివిధ హోమాలు, జపాలు నిర్వహించారు. ఉదయం భక్తులు ఓంనమశ్శివాయ, హరోం హర అంటూ శివపార్వతుల రథాన్ని లాగారు. పుష్పగిరి పీఠాధిపతి విద్యా నృసింహభారతి స్వామి శివపార్వతుల రథోత్సవాన్ని ప్రారంభించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి రథోత్సవంలో పీఠాధిపతి పాల్గొన్నారు. భక్తులు గోవిందా గోవిందా అని స్వామిని స్మరిస్తూ రథం లాగారు. శంకరజయంతి సందర్భంగా పుష్పగిరి పీఠంలో పీఠాధిపతుల ఆధ్వర్యంలో చంద్రమౌళీశ్వర స్ఫటిక లింగానికి రుద్రాభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. రథోత్సవం సందర్భంగా ఎస్ఐ పెద్ద ఓబన్న ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

రేపటి నుంచి బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు



ఆరాధనోత్సవాలపై మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రమోహన్

బ్రహ్మంగారిమఠం, మే 2 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన గురుపూజా మహోత్సవాలు 4వ తేదీ ఆదివారం నుంచి 9వతేదీ వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ శుక్రవారం బి.మఠం మండల పరిషత్ సభాభవనంలో అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజా మహోత్సవాలకు వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని అన్నారు. ముఖ్యంగా తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, భక్తులకు స్నానం గదులు, బస చేయడానికి రూములు వంటి సౌకర్యాలను కల్పించాలన్నారు. ఉత్సవాల సమయంలో విద్యుత్ అంతరాయం కలగకుండా పర్యవేక్షించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగునీటిని 24గంటలు భక్తులకు అందించాలన్నారు. ఉత్సవాల్లో వైద్యాధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, డీఎంహెచ్‌వో నాగరాజు, ఎక్సైజ్ సీఐ వినోద్‌కుమార్, దేవదాయ శాఖ ఏసీ మల్లికార్జున, బి.మఠం ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ, మైదుకూరు సీఐ శివశంకర్‌యాదవ్, డీపీవో రాజ్యలక్ష్మి, సీడీపీవో నిర్మలాదేవి, మైదుకూరు, బి.మఠం ఎస్ఐ చంద్రశేఖర్, తహశీల్దారు దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి ఐదేళ్ల జైలు.. రూ.12 లక్షల జరిమానా

సిద్దవటం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం కేసులో ఇరువురికి ఐదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.6 లక్షల చొప్పున రూ.12 లక్షలు జరిమానా విధిస్తూ శుక్రవారం ఆర్ఎస్ఎస్ అడిషనల్ సెషన్స్ కోర్టులో తీర్పు వెలువడినట్లు సిద్దవటం రేంజర్ బి.కళావతి తెలిపారు. సిద్దవటం అటవీశాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ కడప డీఎఫ్‌వో వినయ్‌కుమార్ పర్యవేక్షణలో సిద్దవటం రేంజ్‌లో దాఖలైన కేసు (ఓఆర్ 71/2019-20, ఆర్ఎస్ ఎస్సీ 425/2022) ఆర్ఎస్ఎస్ అడిషనల్ సెషన్స్ కోర్టులో తీర్పు వెలువరించిందన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులు సిద్దవటం మండలం మాధవరానికి చెందిన రామేటి సుబ్బరాజు, మలినేనిపట్నానికి చెందిన గంపాల యల్లయ్యలపై అభియోగాలు నిరూపితమయ్యాయన్నారు. సిద్దవటం రేంజ్‌లోని ముత్తుకూరు బీట్‌లో ఎర్రచందనం అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించినట్లు విచారణలో తేలిందన్నారు. పట్టుబడ్డ ఎర్రచందనం దుంగల విలువ రూ.18 లక్షలు ఉంటుందన్నారు. తీర్పు అనంతరం సిద్దవటం రేంజ్ సిబ్బంది నిందితులను అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఆమె తెలిపారు.



శిక్షపడిన రామేటి సుబ్బరాజు, గంపాల యల్లయ్య

శిలాఫలకాలతో సరి..!

- అటకెక్కిన దేవునికడప సుందరీకరణ
- రూ.74 కోట్లతో టెండరు
- 8 శాతం కమీషన్‌తో ముడుపులు
- జంగిల్ క్లియరెన్స్‌తో సరిపెట్టారు
- అడుగు ముందుకు పడని వైనం

దేవునికడప
చెరువు సుందరీకరణ అటకెక్కింది. నాలుగేళ్ల క్రితం ఆర్భాటంగా వైసీపీ హయాంలో అప్పటి సీఎం జగన్ చెరువు సుందరీకరణ పనులతో పాటు రోడ్ల విస్తరణకు సంబంధించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్పొరేషన్ కూడా వైసీపీ పాలనలో ఉండటంతో కడపలో రోడ్ల విస్తరణతో పాటు చెరువు సుందరీకరణ పూర్తవుతుందని నగర ప్రజలు అనుకున్నారు. అయితే సుందరీకరణ కలగానే మారింది. కేవలం జంగిల్ క్లియరెన్స్‌కే పరిమితమైంది.



సుందరీకరణకు నోచుకోని దేవునికడప చెరువు



2021 జులై 9వ తేదీన కడప నగరంలో రోడ్ల విస్తరణ, సుందరీకరణ పనులకు శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న వైఎస్ జగన్ (ఫైల్‌ఫోటో)

(కడప-ఆంధ్రజ్యోతి): కడప నగరం శరవేగంగా విస్తరిస్తోంది. బయటి ప్రాంతాల నుంచి వచ్చి కడపలో నివాసం ఉండేందుకు జనం మొగ్గుచూపుతున్నారు. నగరంలో సుమారు 4.10 లక్షలకు పైగా జనాభా ఉంది. అందుకు తగ్గట్లు సరైన వసతులు లేవు. ముఖ్యంగా ఆటవిడుపు కోసం పార్కులు, వాకింగ్ ట్రాక్స్ చెప్పుకోదగ్గట్లు లేవు. శిల్పారామం, నగరవనం ఉన్నప్పటికీ అవి దూరంగా ఉండడంతో అందరికీ అందుబాటులో లేవు. ఈ నేపథ్యంలో దేవునికడప చెరువును సుందరీకరించాలని దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచి అనుకుంటూ వస్తున్నారు. వైసీపీ హయాంలో కడపలో రోడ్లవిస్తరణ, బుగ్గవంక సుందరీకరణ, దేవునికడప చెరువు బ్యూటిఫికేషన్ కోసం 2021 జులై 9వ తేదీన అప్పటి సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. త్వరితగతిన ఇవన్నీ పూర్తి చేస్తామంటూ చెప్పుకొచ్చారు. అయితే సుందరీకరణ కేవలం శంకుస్థాపనకే పరిమితమైంది.

రూ.74 కోట్లతో..

హైదరాబాదులోని ట్యాంక్‌బండ్ తరహాలో దేవునికడప చెరువును సుందడరీకరించాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.74 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. చెరువుకట్ట రివిట్‌మెంటు, వాకింగ్ ట్రాక్, బోటింగ్, ఫుడ్‌కోర్టు, రిక్రియేషన్ క్లబ్, చిన్నపిల్లల పార్కు.. ఇలా అన్ని వసతులు ఏర్పాటుచేసి కడప నగరానికి ఇదొక గొప్ప టూరిజం స్పాట్‌గా చేస్తామని చెప్పుకొచ్చారు. కన్సల్టెన్సీలతో డిజైన్లు తయారు చేయించారు. అదిగో హైదరాబాదు ట్యాంక్‌బండ్ తరహా దేవునికడప చెరువు అంటూ చెప్పుకొచ్చారు.

చంద్రబాబు ప్రభుత్వంపైనే ఆశలు

దేవునికడప చెరువు సుందరీకరణకు సంబంధించి చంద్రబాబు సర్కారు పైనే కడప నగర జనం ఆశలు పెట్టుకున్నారు. జగన్ హయాంలో కొన్ని రహదారులు విస్తరించారు. మరికొన్నింటి విస్తరణ ఆగిపోయింది. అప్పట్లో మొదలుపెట్టిన కొన్ని పనులు నిలిచిపోయాయి. టీడీపీ అధికారం చేపట్టాక అవి ఒక్కోటి పూర్తి చేస్తున్నారు. కోటిరెడ్డిసర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండుకు వెళ్లే రోడ్డు పూర్తయింది. క్రిష్ణసర్కిల్ నుంచి దేవునికడప రోడ్డు పనులు జరుగుతున్నాయి. దేవునికడప సుందరీకరణ కూడా టీడీపీ ప్రభుత్వం పూర్తి చేస్తుందని అందరూ భావిస్తున్నారు. ఈ పనులు పూర్తయితే కడప నగర జవానికి ఆటవిడుపు కోసం, సేద తీరేందుకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. దీనికి తోడు పర్యాటక పరంగా ప్రభుత్వానికి ఆదాయమూ సమకూరుతుంది.

కమీషన్లు పుచ్చుకున్నారు

వైసీపీ హయాంలో ఏ పనులు చేపట్టినా కమీషన్లు తీసుకునేవారని చెబుతారు. ఇందులో భాగంగానే రూ.74 కోట్ల సుందరీకరణ పనులకు సంబంధించి 8 శాతం కమీషన్లు చేతులు మారి కావాల్సిన వారికి చేరిపోయాయంటారు. టెండరు కూడా పిలిచారు. అయితే హెడ్ ఆఫ్ అకౌంటు లేకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేయలేదు. దీంతో అప్పటి కమిషనర్ అమృత్ స్కీం నిధులతో చెరువు సుందరీకరణ చేపట్టాలని నిర్ణయించారు. ముందు నిర్వహించిన టెండరు రద్దు చేసి తిరిగి అమృత్ స్కీం ద్వారా టెండరు పిలవాలని అప్పట్లో అధికారులు చెప్పారు. దీంతో ఆ పని ఆగిపోయింది. కేవలం జంగిల్ క్లియరెన్స్ చేశారు. కొంత మేర రోడ్డు వేసి వదిలేశారు.

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన మామిడి, చీనీ చెట్లు
- 100 ఎకరాలకు పైగా దెబ్బతిన్న నువ్వులపంట

అట్లూరు, మే 2(ఆంధ్రజ్యోతి): అట్లూరు మండలంలో గురువారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. పలు గ్రామాల్లో మామిడి, చీనీ చెట్లు కూలడంతో పాటు తోటల్లో కాయలు నేలరాలాయి. రైతులకు లక్షల రూపాయల నష్టం వాటిల్లింది. ముత్తుకూరు, కొండూరు, వలసపాలెం, మునివారిపల్లె, కామసముద్రం గ్రామాల్లో కోతకోసి కల్లాలపై ఎండబెట్టే సమయంలో గాలివాన బీభత్సానికి నువ్వుల పంట 100 ఎకరాలకు పైగా తడిసి ముద్ద కావడంతో రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూశారు. పొలాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగి వీధులకు అడ్డంగా పడడంతో విద్యుత్ అధికారులు విజయకుమార్ తమ సిబ్బందితో శుక్రవారం ఉదయం పనులు చేపట్టి వాటిని పునరుద్ధరించారు. మండల వ్యాప్తంగా పెద్ద పెద్ద చెట్లు రోడ్లపై పడ్డంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. తోటపల్లెలో ఇంటిపై వేసుకున్న రేకులు గాలికి ఎగిరిపోయాయి. మండల వ్యాప్తంగా పంటలకు తీవ్రనష్టం వాటిల్లినట్లు ఉద్యాన అధికారి భరత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు పంటనష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక అందించామని అన్నారు.



కామసముద్రంలో గురువారం రాత్రి గాలివానకు నేలకొరిగిన మామిడి చెట్లు

హమ్మయ్యా..

యాప్‌ల గోల తప్పింది

- ఇక నుంచి పాఠశాల స్థాయిలో ఒకటే యాప్
- లీప్ యాప్‌ను అమల్లోకి తీసుకువచ్చిన విద్యాశాఖ
- ఉపాధ్యాయులకు విముక్తి కల్పించిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు



వివరాలు.. 7లో

రేషన్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు

పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించడానికి గడువును 5వ తేదీ వరకు పొడిగించారని ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంత వరకు పరీక్ష ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముస్లింలకు రాయితీ రుణాలు

- దరఖాస్తులకు 25 వరకు గడువు
- జిల్లాకు 1723 యూనిట్లు
- మైనార్టీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మయ్య



పటాఫట్

కడప ఎన్జీఆర్ సర్కిల్, మే 2(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీలకు ప్రభుత్వం రాయితీ రుణాలు మంజూరు చేసిందని మైనార్టీ కార్పొరేషన్ ఈడీ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. వీటికి ఈనెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ రుణాలకు సంబంధించి విధివిధానాలపై ఆయన ఆంధ్రజ్యోతితో పటాఫట్ ఇంటర్వ్యూలో మాట్లాడారు.

ప్రశ్న: జిల్లాకు ఎన్ని యూనిట్లు మంజూరయ్యాయి
జవాబు: కడప జిల్లాలోని అన్ని మండలాలకు కలిపి 1,723 యూనిట్లు మంజూరు అయ్యాయి. అన్నమయ్య జిల్లాకు 1,587 యూనిట్లు వచ్చాయి.

ప్రశ్న: యూనిట్ల విభజన ఏ విధంగా చేపడుతున్నారు
జవాబు: 2011 జనాభా దామాషా ప్రకారం మండలాలకు యూనిట్లు విభజించాం. ఆయా మండలాలకు కేటాయించిన యూనిట్ల సంఖ్యను అధికారులకు తెలియజేశాం.

జవాబు: ఎంతమేర రుణం ఇస్తున్నారు
జవాబు: అభ్యర్థులు ఎంపిక చేసుకునే యూనిట్‌ను బట్టి లక్ష నుంచి ఐదు లక్షల రూపాయల వరకు రుణం ఇస్తాం.

ప్రశ్న: రాయితీ ఎంత ఇస్తున్నారు
జవాబు: ప్రతి యూనిట్‌కు 50శాతం రాయితీ ఉంటుంది. ఈ మేరకు కడప జిల్లాకు రూ.26.59 కోట్లు, అన్నమయ్య జిల్లాకు రూ.24.45 కోట్లు రాయితీ మంజూరైంది.

ప్రశ్న: రుణాల దరఖాస్తుకు అర్హులు ఎవరు
జవాబు: గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షల లోపు వార్షిక ఆదాయం, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల ఆదాయం ఉన్నవారు అర్హులు. వాహనాలు తీసుకోవాలంటే డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరి. జనరిక్ మెడికల్ స్టోరుకు ఫార్మసీ, డిప్లొమా డిగ్రీ చేసి ఉండాలి.

ప్రశ్న: ఎలా దరఖాస్తు చేసుకోవాలి
జవాబు: అర్హులైన నిరుద్యోగ యువత తమ కుటుంబానికి చెందిన తెల్ల రేషన్‌కార్డు లేదంటే ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా, బ్యాంకు ఖాతాకు అనుసంధానమైన మొబైల్ ఫోను నెంబరు కలిగి ఉండాలి. వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ప్రశ్న: ఎంపిక ప్రక్రియ ఎలాఉంటుంది
జవాబు: మండలాల్లో ఎంపీడీవోలు, మున్సిపాలిటీల్లో కమిషనర్ల ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ జరుగుతుంది.



కమీషన్ల కక్కుర్తి..!

- ప్రొద్దుటూరు పట్టణానికి ఓ ఐటీ ఉద్యోగి కడుపునొప్పితో బాగా పేరున్న మూడు ఆసుపత్రులకు తిరిగి వైద్యులను ఆశ్రయించారు. వెళ్లిన ప్రతిచోటా వివిధ రకాల నిర్ధారణ పరీక్షలు చేయించమని సిఫారసు చేశారు. వారి సూచనల మేరకు కంప్లీట్ బ్లడ్‌పిక్చర్, సీరం కాల్షియం, కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్, సీఆర్‌పీలతో పాటు కొలనోస్కోపీ, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లు చేయించారు. రిపోర్ట్స్ అన్నీ నార్మల్‌గా ఉండటంతో రివ్యూ స్కానింగ్‌లు కూడా జరిగాయి. ఫలితాలు మాత్రం అన్నీ నార్మల్‌గా వచ్చాయి. సుమారు రూ.12 వేలు ఖర్చు చేశాక తనకు వచ్చిన కడుపునొప్పి గ్యాస్ట్రబుల్ వలన అని వైద్యులు నిర్ధారణ చేశారు.
- 45 సంవత్సరాల మహిళ మూడు రోజులుగా తలనొప్పి, వాంతులతో ఇబ్బంది పడుతూ తల, మెడ, నరాల స్పెషలిస్టు వద్ద చూపించగా వెంటనే ఆయన తలకు ఎంఆర్ఐ స్కానింగ్ చేయమని సిఫారసు చేశారు. స్కానింగ్‌కు డబ్బులు లేవు, మందులు రాసివ్వాలని ఆమె కోరగా సమస్య ఏమిటో స్పష్టంగా తెలియనప్పుడు ఏ మందులు రాయాలి.. ఎంఆర్ఐ తీస్తే నరాల్లో రక్తప్రసరణ ఎలా ఉందో, రక్తం గూడు కట్టిందా... లేక మెడలో క్యాన్సర్ కణుతులు ఉన్నాయా.. ఏదీ తేలకుండా మందులు ఎలా రాసేదని చెప్పారు. దీంతో బిత్తరపోయిన ఆ మహిళ వెంటనే సుమారు రూ.5 వేలు ఖర్చు చేసి ఎంఆర్ఐ స్కానింగ్ చేయించగా అంతా నార్మల్ అని రిపోర్టు రావడంతో ఆ తర్వాత వైద్యుడు మందులు రాసిచ్చారు.

- అవసరం లేకున్నా రక్త పరీక్షలకు వైద్యుల సిఫారసు
- ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లలో నిలువుదోపిడీ
- ఫీజుల్లో 60 శాతం వైద్యులకు కమీషన్..!
- హద్దులు దాటుతున్న ఆర్ఎంపీ వైద్యం
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ



ప్రొద్దుటూరు రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): వైద్యుడు నాడి పట్టి వైద్యం అందించే రోజులు గగనం అయ్యాయి. రోగి తనకు ఇబ్బంది పెడుతున్న లక్షణాలను స్పష్టంగా వివరిస్తున్నా వైద్యులు తాము చదువుకున్న చదువు, అనుభవంతో రోగి లక్షణాలను బట్టి వైద్యం అందించే రోజులు కూడా కనుమరుగు అవుతున్నాయి. కడుపునొప్పి, దగ్గు, తలనొప్పి, జ్వరం, ఏది వచ్చినా సరే ఆస్పత్రి మెట్లు ఎక్కితే చాలు.. రక్త పరీక్షలు, స్కానింగ్‌లు అంటూ డాక్టర్లు సిఫారసు చేస్తున్నారు. అవసరం లేకున్నా అనేక రకాల పరీక్షల పేరుతో రోగుల జేబులకు చిల్లు పెడుతున్నారు. ఇదే అదునుగా ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వాహకులు కమీషన్ దందాలకు తెరలేపారు. చాలా కాలంగా నడుస్తున్న ఈ కమీషన్ల దందా ప్రస్తుతం ఒక వ్యాపారంగా మారింది. ఈ మొత్తాల్లో వైద్యులకు, ఆర్ఎంపీలకు కమీషన్ల రూపంలో వాటాలను ముట్టచెప్తుతుండడంతో కొంతమంది వైద్యులు కూడా రోగి చెప్పే సమస్య కన్నా రక్తపరీక్షలు, స్కానింగ్‌లకు చేసే సిఫార్సులపైనే ఆసక్తి చూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా నెలకొన్న ఈ జాడ్యంపై పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని విమర్శలున్నాయి.

వైద్యులకు 60 శాతం కమీషన్

జిల్లాలో రక్త పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌లు దాదాపు 400కిపైగా, డయాగ్నోస్టిక్‌సెంటర్లు 50కి పైగా ఉన్నాయి. సీటీ స్కాన్‌లు 15-20 వరకు ఉన్నట్లు అంచనా. ల్యాబ్‌లలో యజమానులు కొంతమంది వైద్యులతో ముందస్తు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఆ డాక్టర్ రెఫర్ చేసే వైద్య పరీక్షలపై 60 శాతం మొత్తాన్ని కమీషన్ రూపంలో అందుతున్నట్లు సమాచారం. ల్యాబ్‌లో నిర్వహించే రక్త పరీక్షలకు ఏ పరీక్షకు ఎంత తీసుకోవాలనే ధరలు ప్రభుత్వం నిర్ణయించడం లేదు. ఇదే కొంతమందికి ఇష్టారాజ్యంగా మారింది. ఒక వైద్యుడు ఒక స్కానింగ్ సెంటర్‌కు సిఫార్సు చేస్తే ఆ రోగి ఆ స్కానింగ్ సెంటర్‌లో మాత్రమే స్కానింగ్ చేయించుకోవాలి. ఇతర స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ చేయిస్తే ఆ వైద్యుడు ఒప్పుకోడు. జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులలో సుమారు 50 శాతానికి పైగా అటాచ్డ్ ల్యాబ్‌లు ఉన్నాయి. దీంతో ఈ ఆసుపత్రి వైద్యుడు వేరే ల్యాబ్‌లో చేయించిన రిపోర్టులను ఒప్పుకోరు. తమ ల్యాబ్‌లో మరోసారి పరీక్షలు చేయించాల్సిందే.

ఆర్ఎంపీల దోపిడీ

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక చికిత్స నిర్వహించే ఆర్ఎంపీ క్లినిక్‌లలో వైద్యసేవలు హద్దులు మీరుతున్నాయి. తక్కువ ఖర్చులో ఆర్ఎంపీ వద్ద వైద్యం అందుతుందని పేదలు వారిని ఆశ్రయిస్తే కమీషన్లకు ఆశపడి ఒక్కో రోగి నుంచి సుమారు రూ.1200 నుంచి రూ.1400 విలువచేసే రక్త పరీక్షలు చేయిస్తున్నారు. పైగా ఆర్ఎంపీ క్లీనిక్‌ల వద్దకే ల్యాబ్‌ల్లో పనిచేసే అటెండెంట్లు వచ్చి రోగుల బ్లడ్‌శాంపిల్స్‌ను తీసుకెళ్లి గంటలోపు రక్తపరీక్షల నివేదికలు అందజేస్తూ రోగికి తెలియకుండానే పిండి పిప్పి చేస్తున్నారు.

ఒక్కోచోట ఒక్కో రేటు

ల్యాబ్‌లను బట్టి, ప్రాంతాన్ని బట్టి రక్త పరీక్షలకు వసూలు చేసే మొత్తాల్లో వ్యత్యాసాలు ఉన్నాయి. జిల్లా కేంద్రమైన కడపలో ల్యాబ్‌లలో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇవేకాక హెల్త్ చెకప్, మాస్టర్ హెల్త్‌చెకప్ అంటూ ఆఫర్లు ఇస్తూ ఇంటి వద్దనే శాంపిళ్ల సేకరణ, ఇండ్ల వద్దకే రిపోర్టులు అందజేత వంటి సదుపాయాలను అందిస్తూ రోగులను బురిడీ కొట్టిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా నడుస్తున్న కమీషన్ల దందా, అనధికారిక ల్యాబ్‌ల నిర్వహణపై వివరణ కోరేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి రెండు రోజులుగా డీఎంఅండ్‌హెచ్‌వో నాగరాజును ఫోన్‌లో సంప్రదించగా తాము ప్రధాన మంత్రి పర్యటన కార్యక్రమాల్లో బిజీగా ఉన్నానంటూ దాటవేశారు.



అద్భుతంగా అమరావతి



పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం



కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు

సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు

మహిళల విజయ దరహాసం

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోం దని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధాన మంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు



సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు



సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు



గ్యాలరీల బయట జనం

అజ్ఞాతంలోకి 'ఎర్ర' దొంగలు

● పూచీకత్తు ఇచ్చిన ఇద్దరికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మే 2(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం కేసులో ఇద్దరి పూచీకత్తుతో ఐదుగురు నిందితులు జైలు నుంచి విడుదలయ్యారు. వీరిలో ఒకరు చనిపోగా, మిగిలిన నలుగురు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దీంతో పూచీకత్తు దారులకు భారీ జరిమానా విధిస్తూ ఎర్రచందనం కోర్టు జిల్లా ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. అటవీశాఖ అధికారి కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లా పెరియవళ్లి గ్రామానికి చెందిన ఎ.రమేష్, కుమార్, డి.చిన్నస్వామి, సుధాకర్, ఏలుమలై.. చిత్తూరు జిల్లా ఐరాల పరిధిలో ఎర్రచందనం దుంగలు అపహరించారు. ఈ ఘటనకు సంబంధించి ఐదేళ్ల కిందట ఐరాల పోలీసులు కేసు నమోదు చేశారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపారు. కొద్ది రోజుల తర్వాత వీరికి పీలేరుకు చెందిన జి.శేషాద్రి నాయుడు, ప్రసాద్ ష్యూరిటీ ఇచ్చి బెయిల్‌పై విడుదల చేయించారు. బెయిల్‌పై విడుదలైన ఐదుగురిలో ఎ.సుధాకర్ మృతి చెందాడు. మరో నలుగురికి న్యాయమూర్తి నాన్ బెయిలబుల్ సెక్షన్ కింద అరెస్టు చేసి తీసుకురావాలని పోలీసులను ఆదేశించారు. వారు అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో సొంత పూచీకత్తుపై విడుదల చేయించిన ఇద్దరికి.. ఒక్కో నిందితుడికి రూ.20 వేల చొప్పున జరిమానా చెల్లించాలంటూ శుక్రవారం న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు.

జీవనోపాధుల సేవా కేంద్రం.. రైతులకు ఉపయోగం

వీరబల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): జీవనోపాధుల సేవా కేంద్రం రైతులకు ఉపయోగమని జిల్లా జీవనోపాధుల ప్రాజెక్టు మేనేజర్ గంగార్జున తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ సముదాయంలో జీవనోపాధుల సేవా కేంద్రం మండల వ్యవసాయ ఉత్పత్తుల సమాఖ్య అధ్యక్షుడు రాచన్న ప్రారంభించారు. సమీకృత వ్యవసాయ పద్ధతుల ద్వారా జీవనోపాధులు కల్పించడం ద్వారా ఆదాయం పెంపొందించడమే లక్ష్యమన్నారు. మొదటి విడతలో వీరబల్లి, సోమవరం గ్రామంలోని 300 కుటుంబాలను సమీకృత వ్యవసాయ పద్ధతులపై కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్ ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రామచంద్రారెడ్డి, ఏపీఎంలు ఖాదర్‌వలి, రమేశ్‌బాబు, వెంకట్రమణ, సీసీలు గంగాధర్, సుధాకర్, నాగేంద్ర, ఐఎఫ్‌సీ మండల యాంకర్ పర్సన్ అనిత, సీఆర్పీలు జ్యోతి, అనురాధ, రెడ్డెమ్మ, రైతు మిత్ర జనమేజయుడు, బీవోడీ సభ్యులు, ఉపాధి హామీ టీఏ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.



సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

సచివాలయ ఉద్యోగిపై వైసీపీ మూకల దాడి

● ముగ్గురు యువకులపై కేసు నమోదు

తంబళ్లపల్లె, మే 2(ఆంధ్రజ్యోతి): తన స్నేహితుడిని దుర్భాషలాడినందుకు ప్రశ్నించిన ఓ సచివాలయ ఉద్యోగిపై వైసీపీ మూకలు కత్తితో దాడి చేసి గాయపరిచాయి. బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు.. తంబళ్లపల్లె మండలంలోని ఎర్రసానిపల్లె పంచాయతీ ఎర్రమద్దువారిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త కృష్ణమూర్తి కుమారుడు గణేశ్(28) చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం పుదిపట్ల గ్రామ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కురబలకోట మండలం మట్లివారిపల్లె నివాసి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆయన స్నేహితుడు. కొన్ని రోజుల క్రితం తంబళ్లపల్లెకు చెందిన మున్వర్.. ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ఫోన్ చేసి, బస్టాండులో బహిరంగంగా దూషించాడు. ఈ విషయం అతను తన స్నేహితుడైన గణేష్‌కు తెలిపాడు. దీంతో తన స్నేహితుడిని ఎందుకు తిట్టావని గణేశ్, మున్వర్‌ను ప్రశ్నించగా.. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి టీడీపీకి చెందిన వ్యక్తి అని, నీవెందుకు అతడికి సపోర్ట్ చేస్తున్నావని ప్రశ్నించాడు. దీంతో పాటు, నీ అంతు చూస్తానని బెదిరించాడు. ఇదిలా ఉండగా గురువారం సాయంత్రం గణేశ్ స్నేహితులతో కలసి తంబళ్లపల్లెలో చికెన్ పకోడా సెంటర్ వద్ద ఉండగా మున్వర్, మహమ్మద్, శశి ద్విచక్రవాహనంలో వచ్చి కత్తితో దాడి చేశారు. విషయం గమనించి స్థానికులు బిగ్గరగా కేకలు వేయడంతో వారు పారిపోయారు. గాయపడిన గణేశ్‌ను స్నేహితులు తంబళ్లపల్లె సీహెచ్‌సీకి తరలించగా వైద్యులు ప్రథమచికిత్స అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ లోకేశ్‌రెడ్డి తెలిపారు. విషయం తెలుసుకున్న తంబళ్లపల్లె టీడీపీ ప్రచార సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు గణేష్‌ను పరామర్శించారు. దాడి ఘటనను పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర తీవ్రంగా ఖండించారు. మదనపల్లె జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్న గణేష్‌ను తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, పార్లమెంట్ తెలుగు యువత జనరల్ సెక్రటరీ షేక్ అయూబ్ బాషా, తంబళ్లపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, బీసీ నాయకుడు తులసీధర్‌నాయుడు, క్లస్టర్ ఇంచార్జి బేరిశీన, కట్టా దొరస్వామి నాయుడు, తెలుగుయువత అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పరామర్శించారు. దాడికి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గణేశ్‌ను పరామర్శిస్తున్న శ్రీరాం చినబాబు, టీడీపీ నాయకులు, గణేశ్ కాలికి గాయమైన దృశ్యం

బాలుపల్లె అడవిలో మంటలు

● అప్రమత్తమైన అటవీశాఖాధికారులు



మంటలను ఆర్పుతున్న సిబ్బంది

రైల్వేకోడూరు, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలుపల్లె అడవిలో గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో మంటలు చెలరేగాయి. అటవీశాఖ అధికారులు రాత్రి అప్రమత్తమై మంటలను ఆర్పే పనిలో పడ్డారు. అన్నమయ్య జిల్లా అటవీశాఖ అధికారి జగన్నాథ్‌సింగ్, రైల్వేకోడూరు సబ్‌డీఎఫ్‌వో సుబ్బరాజ్, బాలుపల్లె రేంజర్ ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి జిల్లా అటవీశాఖాధికారి వివేక్, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు చెందిన అటవీశాఖ సిబ్బంది కలసి బాలుపల్లె అడవిలోని కంగుమడుగు, మొగిలిపెంట ప్రాంతాల్లో ఉన్న అడవిలో మంటలను అదుపు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. దీనికితోడు శుక్రవారం వర్షం తోడైంది. దీంతో మంటలను ఆర్పడానికి వరుణదేవుడు కూడా సహకరించాడు. అప్పటికే మంటల్లో అడవిలో జీవిస్తున్న జీవరాసులు కాలిపోయాయి. అనేక అరుదైన చెట్లు, మొక్కలు కాలిబూడిదయ్యాయి. పచ్చని చెట్లు మంటలకు మాడిపోయాయి. అడవిలోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించడం, బీడీలు, సిగిరేట్లు తాగి పడవేయడంతోనే మంటలు చెలరేగుతున్నాయని అధికారులు గుర్తించారు. బాలుపల్లె అడవిలో మొదలైన మంటలు తుంబూరుతీర్థం, తిరుమల వైపు వెళ్లాయని అధికారులు అంటున్నారు. అయితే వర్షం పడడంతో చాలా వరకు మంటలు ఆరిపోయినట్లు అటవీశాఖాధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎర్రచందనం దుంగలు పట్టివేత

● వాహనం స్వాధీనం ● దొంగలు పరార్

ఒంటిమిట్ట, మే 2 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట ఫారెస్ట్ అధికారులు శుక్రవారం ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. దుంగలను క్యాబేజీ మూటల మధ్యలో దాచి ఐచర్ వాహనంలో తరలిస్తుండగా స్థానిక అటవీశాఖ అధికారులు వెంటపడి పట్టుకున్నారు. అటవీశాఖ అధికారులకు ముందుగా సమాచారం అందడంతో మాటు వేసి ఒంటిమిట్ట-కడప జాతీయ రహదారిపై చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు తెలిసింది. ఐచర్ వాహనంలో సుమారు 80కి పైగా దుంగలు ఉన్నట్లు సమాచారం. ఇన్‌చార్జి రేంజర్ బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో సిబ్బంది మాటువేసి పట్టుకున్నట్లు తెలిసింది. ఐచర్ డ్రైవర్, మరో వ్యక్తి పరారైనట్లు సమాచారం. పట్టుబడిన దుంగల విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని, పరారైన వారి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిసింది. ఈ ముఠాను గుర్తించేందుకు అటవీశాఖ అధికారులు ముమ్మరంగా ప్రయత్నం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.



దుంగలతో పట్టుబడిన ఐచర్ వాహనం

చెరువులో మునిగి ఒకరి మృతి

నిమ్మనపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): చేపల కోసం వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో మునిగి మృతిచెందాడు. స్థానిక పోలీసుల కథనం మేరకు.. రాచవేటివారిపల్లి పంచాయతీ ఆచార్లపల్లికి చెందిన బోడుమల్ల జగన్నాథం (40) బుధవారం గ్రామానికి సమీపంలో ఉన్న ముసలినాయుని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగి రాలేదు. తన భర్త ఎక్కడికో వెళ్లి ఉంటాడని భార్య బుజ్జమ్మ కూడా అంతగా పట్టించుకోలేదు. అయితే చెరువులో శవం తేలుతోందని శుక్రవారం స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు మృతదేహాన్ని వెలికితీసి విచారణ చేశారు. చనిపోయింది తన భర్తేనని బుజ్జమ్మ నిర్ధారించింది. కాగా, చేపలు పట్టే యత్నంలో చెరువులో మునిగి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పురుగుల మందు తాగి యువతి..



ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన యువతి

మదనపల్లెఅర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా ఓ యువతి పురుగుల మందు తాగి ఆత్మ హత్య చేసుకుంది. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసుల కథనం మేరకు ములకలచెరువు మండలం, చిన్నమొరవపల్లెకు చెందిన అమర నాథరెడ్డి భార్య శిరీష(26) మదనపల్లెలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ హోంలో నెల రోజుల క్రితం వరకు నర్సుగా పనిచేసేది. ఆమె భర్త ఎక్స్‌క వేటర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వివాహమై ఏడేళ్లైనా పిల్లలు కలుగలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కటుంబసభ్యులు ఆమెను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ములకలచెరువు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరు..



మృతి చెందిన సుబ్రహ్మణ్యం (ఫైల్‌ఫొటో)

మదనపల్లెఅర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. నందలూరు గ్రామానికి చెందిన కొందరు గంగి రెద్దులు ఆడించేవారు. గురువారం రాత్రి రామసముద్రం మండలం, చెంబకూరు సమీపంలో యల్లమ్మ ఊరేగింపులో పాల్గొన్నారు. వారిలోని సుబ్రహ్మణ్యం (35) అనే యువకుడు బ్యాటరీకి చార్జీ చేయడానికి కరెంటు స్తంభం లైన్‌కు తగిలిస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. రామసముద్రం పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సుభాషిణి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రామ సముద్రం ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



- ఇక నుంచి పాఠశాల స్థాయిలో ఒకటే యాప్
- లీప్ యాప్‌ను అమల్లోకి తీసుకువచ్చిన విద్యాశాఖ
- ఉపాధ్యాయులకు విముక్తి కల్పించిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు



హమ్మయ్యా... యాప్‌ల గోల తప్పింది

కడప ఎడ్యుకేషన్, మే 2 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులకు నరకం చూపారు. విద్యార్థుల హాజరుకు యాప్, ఉపాధ్యాయుల ముఖ హాజరుకు యాప్, మధ్యాహ్న భోజనం అమలుకు యాప్, మరుగుదొడ్ల నిర్వహణకు యాప్, విద్యార్థుల మార్కులు అప్‌లోడ్‌కి యాప్ ఇలా యాప్‌లతో ఉపాధ్యాయులు అల్లాడి పోయారు. పాఠశాలకు వెళ్లినప్పటి నుంచి తిరిగి ఇంటికి వచ్చే వరకు యాప్‌ల గోలతో ఆపసోపాలు పడాల్సి వచ్చేది. దీంతో తాము బోధనపై దృష్టి సారించలేకపోతున్నామని అప్పటి ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పెడచెవిన పెట్టింది. కూటమి ప్రభుత్వం తాజాగా ఉపాధ్యాయులకు యాప్ కష్టాల నుంచి విముక్తి కల్పించింది. ఇక నుంచి పాఠశాల స్థాయిలో ఒకటే యాప్‌ను అమలు చేయనుంది. దీంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయులంటే విద్యార్థులకు బోధన చేయాలి... కానీ గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన యాప్‌లతో ఉపాధ్యాయులు బోధన పక్కనపెట్టాల్సి వచ్చేది. ఉపాధ్యాయు లు నిత్యం పదికి పైగా యాప్‌లతో సమాచారం పంపాల్సిన దుస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యాప్‌ల కష్టాల నుంచి ఉపశమనం కల్పిస్తామని యువగళం పాదయాత్రలో నారాలోకేష్ హామీ ఇచ్చారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రిగా ఆయన ఇక పాఠశాల స్థాయిలో ఒకే యాప్‌ను తీసుకువస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

కడప జిల్లాలో మండల పరిషత్, జడ్పీ, ప్రభుత్వ పాఠశాలలు 2047 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 1.40 లక్షల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుండగా 7821 మందికి పైగా ఉపాధ్యాయులు ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్కో అంశానికి సంబంధించి ఒక్కో యాప్‌ను ప్రవేశపెట్టారు. కేవలం ఉపాధ్యాయులపై కక్షసాధింపులా యాప్‌లను ప్రవేశ పెట్టారన్న విమర్శలు వచ్చినా.. యాప్‌ల కష్టాల నుంచి తప్పించాలని ఉపాధ్యాయులు రోడ్డెక్కినా నాటి ప్రభుత్వం స్పందించ లేదు. దాదాపు పదికిపైగా యాప్‌లతో నిత్యం ఉపాధ్యాయులు కుస్తీ పడాల్సి వచ్చేది.

ఇక అన్నింటికి ఒకేయాప్

ప్రభుత్వం తాజాగా లెర్నింగ్ ఎక్‌సెలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (లీప్) పేరుతో నూతన యాప్‌ను తీసుకువచ్చింది. లీప్ యాప్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ఉపయోగించుకునేలా ఏర్పాటు చేసింది. కడప జిల్లాలోని డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు తప్పనిసరిగా తమ మొబైల్‌లో లీప్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకొని ఉపయోగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఈ యాప్ ఆండ్రాయిడ్ 8, ఇతర వెర్షన్ మొబైల్ ఫోన్‌లలో పనిచేస్తుందని విద్యాశాఖ అధికారులు చెబుతు న్నారు. ప్రస్తుతానికి స్కూల్ అటెండెన్స్ యాప్‌లో విని యోగిస్తున్న లాగిన్లను పాస్‌వర్డ్‌లను ఉపయోగించి నూతన యాప్‌లో లాగిన్ కావాలని స్పష్టం చేస్తున్నారు. ఉపాధ్యా యుల, విద్యార్థుల హాజరు, సెలవులను యాప్‌లో మాత్రమే నమోదు చేయాల్సి ఉంది.

పనిభారం తగ్గింపు



నూతన యాప్ వల్ల ఉపాధ్యాయుల పనిభారం తగ్గుతుంది. పాఠశాలలకు సంబంధించిన సమస్త సమాచారం ఒకేయాప్ నమోదు చేయడం వలన అనేక ప్రయోజనాలు ఉం టాయి. గతంలో ఉన్న యాప్‌లను అన్‌ఇన్‌స్టాల్ చేసే ముందు యాప్‌లకు సంబంధిం చిన లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ ఒకచోట నమోదు చేసుకోవాలి.

- షంషుద్దీన్, డీఈఓ

పిడుగుపాటుకు యువకుడి మృతి



నాగేశ్వర్ మృతదేహం

మైలవరం, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన మేకల నాగేశ్వర్ (26) అనే వ్యక్తి పిడుగుపాటుకు మృతి చెందాడు. తలమంచిపట్నం పోలీసులు, స్థానికుల వివరాల మేరకు... గొల్లపల్లెలోని మిరపకాయల కలంలో మిరపకాయలను సంచులకు ఎత్తే సమయంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు మెరువడంతో ఆ శబ్దానికి నాగేశ్వర్ భయాందోళనకు గురై ఒక్కసారిగా కిందపడిపోయాడు. వెంటనే అక్కడున్నవారు వద్దిరాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 108లో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నాగేశ్వర్ కూలి పనులకు వెళ్లి జీవనం సాగించేవాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒక పాపకు మూడేళ్లు కాగా.. బాబు పుట్టి వారం రోజులైందని, అంతలోనే ఈ దుర్ఘటన జరిగిందని కుటుంబ సభ్యులు,బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదచ్ఛాయలు అలుముకున్నాయి. నాగేశ్వర్ భార్య సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు తలమంచిపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు.

65 మద్యం బాటిళ్లు స్వాధీనం



అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎస్ఐ

ఎర్రగుంట్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): రైలులో అక్రమంగా తరలిస్తున్న 65 మద్యం బాటిళ్లను ఎర్రగుంట్ల రైల్వే పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. నంద్యాల జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు పూణే జయంతి ఎక్స్‌ప్రెస్‌లో ఎలాంటి బిల్లులు లేకుండా తీసుకుకెళుతున్న 65ఫుల్ మద్యం బాటిళ్లను పట్టుకు న్నారు. వీటిని పాండిచ్చేరి నుంచి నంద్యాలకు తీసుకెళుతు న్నట్లు ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రైలుదిగి మద్యం బాటిళ్లతో వెళుతున్న వారిని ఫ్లాట్‌ఫారంపై పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేసిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

కడప క్రైం, మే 2 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం కడప నగరంతో పాటు జిల్లాలోని ప్రధాన పట్టణాల్లోని అన్ని కూడళ్లలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. సీఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో సిబ్బంది రద్దీ ప్రదేశాల్లో, ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీలు చేపట్టి అనుమానాస్పద వ్యక్తులను విచారించారు. వారి వివరాలను ఆరా తీశారు. లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

ఈదురుగాలుల బీభత్సం.. దెబ్బతిన్న పంటలు





పడిపోయిన మామిడి చెట్ల వద్ద రైతు జగన్‌మోహన్‌రెడ్డి, ఈదురుగాలులకు పడిపోయిన అరటి పంట

సీకేదిన్నె, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు పలు చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. కొన్ని చెట్లు కరెంటు స్తంభాలు సైతం పడిపోయాయి. బొగ్గులపల్లె పంచాయతీ గూడావాండ్లపల్లె, బుగ్గలపల్లె, ఇప్పెంట పంచాయతీల్లో మామిడి, అరటి రైతులు భారీగా నష్టపోయారు. గూడావాండ్లపల్లెలో రైతు జగన్‌మోహన్‌రెడ్డి తన ఆరు ఎకరాల పొలంలో దాదాపు నాలుగేళ్ల వయస్సు ఉన్న వందకుపైగా మామిడి చెట్లు నేలకొరిగాయి. కాపుకు వచ్చి పంట చేతికొచ్చే సమయంలో చెట్లు నేలకొరగడంతో రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా క్రిష్ణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఇప్పెంటలోని నాగరాజు, తదితరుల అరటి చెట్లు నేలకొరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఖాజీపేట మండలంలో...



రేకులు కొట్టుకుపోయిన గృహం

ఖాజీపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించే రైతన్నలకు ఏదో ఒక రూపంలో నష్టం వాటిల్లుతోంది. గురువారం రాత్రి ఖాజీపేట మండల పరిధిలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో రైతన్నలు నూర్పిడి చేసేందుకు పట్టలపై వేసిన నువ్వుల పంట కొట్టుకుపోయి నువ్వులు నేలపాలయ్యాయి. అలాగే మండల పరిధిలోని పుల్లూరు మాలవాడలో ఓబయ్య, జ్యోతిలు గృహాలకు ఏర్పాటు చేసుకున్న రేకులు కొట్టుకుపోయాయి. దీంతో ఒక్కో కుటుంబానికి రూ.50 వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని వారు కోరారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

పోరుమామిళ్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో స్వాతి అనే వివాహిత విష ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. శుక్రవారం సాయంత్రం విష ద్రావణం తాగి ఆ మహిళ అపస్మారక స్థితిలో ఉండడంతో గమనించిన కొందరు 108కు సమాచారం ఇవ్వడంతో వారు పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉంది. అక్కడ వారికి తన పేరు స్వాతి అని చెప్పినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

గుర్తు తెలియని శవం లభ్యం

పోరుమామిళ్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దమ్మనపల్లె నుంచి కట్టకింద వెళ్లే దారి మధ్యలో గుర్తుతెలియని శవం బయటపడినట్లు స్థానికులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం కొందరు ఆ దారి వెంబడి వెళుతుండగా నీటిలో తేలియాడుతూ శవం కంటపడిందని తెలిపారు. ఇందుకు సంబంధించి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎటువంటి ఫిర్యాదు అందలేదు. కాగా ఇది కలసపాడు పరిధిలోకి వస్తుందా, పోరుమామిళ్ల పరిధిలోకి వస్తుందా అని ఆ ప్రాంతవాసులు ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక తర్జనభర్జనపడుతున్నారు. అయితే పోలీసులకు మాత్రం ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిసింది.

రేషన్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు



ప్రొద్దుటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు అర్బన్, రూరల్ పరిధిలోని రెండు రేషన్ దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం వేర్వేరుగా దాడులు నిర్వహించారు. ప్రొద్దుటూరు సూపర్ బజార్‌వీధిలోని డీలర్ ఎరికలరెడ్డికి చెందిన షాపునెంబరు 14లో విజిలెన్స్ సీఐ శివన్న దాడులు నిర్వహించారు. 96.50 క్వింటాళ్ల బియ్యం, 525 ప్యాకెట్ల చెక్కర నిల్వల్లో తేడాలున్నాయి. దీంతో డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. అలాగే పెద్ద శెట్టిపల్లెలోని డీలర్ బి.ఆదిలక్ష్మికి చెందిన షాపు నెంబరు 93 రేషన్ దుకాణంపై విజిలెన్సు సీఐ నారాయణప్ప ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో షాపులో 44.50 క్వింటాళ్ల రేషన్‌బియ్యం, 306 చెక్కర ప్యాకెట్లు నిల్వల్లో తేడాలున్నట్లు గుర్తించారు. దీంతో ఆదిలక్ష్మిపై 6ఏ కేసు నమోదు చేశారు. ఈ దాడుల అనంతరం బియ్యం చెక్కర నిల్వలను సివిల్ సప్లయి డీటీ మల్లికార్జున, ఎఫ్ఐ మహేంద్రరెడ్డిలకు విజిలెన్సు అధికారులు అప్పగించారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు.. తహసీల్దారు విచారణ

ప్రొద్దుటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం పెద్దశెట్టిపల్లె పంచాయతీ శంక రాపురం గ్రామానికి చెందిన పల్లబోతుల సుబ్బలక్షుమ్మ అనే వృద్ధురాలు పెద్దశెట్టిపల్లె, చౌడూరు గ్రామ పొలాల్లోని తన 170 ఎకరాల భూమిని 12 మంది ఆక్రమించారని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు తహసీల్దారు గంగయ్య సుబ్బలక్షుమ్మ ఆరోపించిన 12 మందికి నోటీసులు జారీ చేసి.. శుక్రవారం తన కార్యాలయంలో విచారణ చేపట్టారు.

కాగా విచారణకు 12 మందిలో ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. వీరిని సుబ్బలక్షుమ్మకు సంబంధించి 170 ఎకరాల భూములను ఆక్రమించారా అని తహ సీల్దారు ప్రశ్నించారు. ఇందుకు వారు సుబ్బలక్షుమ్మ భూములకు సంబంధించిన ఆధారాలు చూపమన్నారు. ఇందుకు సుబ్బలక్షుమ్మను ఆధారాలు చూపమని కోరగా.. తన ఆస్థి పత్రాలు చూపడానికి వాయిదా కోరింది. దీంతో మే 14 నాటికి విచారణను తహసీల్దారు వాయిదా వేశారు. ఈ విచారణలో డిప్యూటీ తహసీల్దారు వెంకటసాయినాథ్‌రెడ్డి, ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి, వీఆర్‌వో సుధీర్‌లు పాల్గొన్నారు.

మత్స్యశాఖ ఏడీగా శ్యామలమ్మ బాధ్యతలు

కడప రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ ఏడీగా శ్యామలమ్మ బాధ్యతలు చేపట్టారు. ఈమె నంద్యాల ఏడీగా పనిచేస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి, అభివృద్ధికి, ప్రభుత్వ లక్ష్యసాధనకు పాటుపడతామన్నారు.

కిశోర బాలికల వికాసం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలి

వల్లూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల కోసం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసం అనే కార్యక్రమం ఈ నెల 2వతేదీ నుంచి 10 వరకు ఉత్సవంలా జరుగుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజరు పార్వతి అన్నారు. తప్పెట్లలో జరిగిన సమావేశంలో కిశోర బాలికల తల్లులతో మాట్లాడుతూ 15 నుండి 18 సంవత్సరాల వరకు ఉన్న బాలికల కోసం అందరినీకలిసి ఒక కమిటి ఏర్పాటు చేయాలని ఆ కమిటీలో బాలికలే ఉండేట్లు చూసుకోవాలన్నారు. అలాగే వీరితో పాటు కమిటీ సభ్యులుగా ఎంఎస్‌కే కన్వీనరు అంగన్వాడీ, ఏఎన్ఎం, ఆశా, సభ్యులుగా ఉంటారని అన్నారు.

ఉద్యోగులకు సదుపాయాలు అందాలి

కడప మారుతీనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్న ఉద్యోగులకు న్యాయపరంగా అందాల్సిన సదుపాయాలు ఏ మాత్రం అందాలని ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాజీ పఠాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రామాంజనేయులు, కిరణ్, వెంకట జనార్ధనరెడ్డి, మదన మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటి కోసం..

● గ్రామాలవైపు వస్తూ మృత్యువాత పడుతున్న జింకలు ● నెల రోజుల్లో మూడు ప్రమాదాలు

సీకేదిన్నె, మే 2 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో మంచినీటికి మూగజీవాలు చాలా ఇబ్బంది పడుతున్నాయి. కొంత కాలంగా ఎండలు మండి పోతుండడంతో అక్కడక్కడ గుంతల్లో, చెరువుల్లో ఉండే నీరు సైతం ఆవిరైపోయాయి. దీంతో వన్య ప్రాణులు అడవిలో నీరు దొరక్క నీటికోసం సమీప గ్రామాలవైపు పరుగులు తీస్తున్నాయి. నీటి కోసం వస్తే ఒకవైపు రోడ్డు ప్రమాదాలు, మరోవైపు కుక్కల దాడులతో ప్రాణాలను కోల్పోవాల్సి వస్తోంది. దీంతో వాటి ప్రాణాలకు రక్షణ కరువవుతోంది. చింతకొమ్మదిన్నె మండలంలో కొప్పర్తి, తాడిగొట్ల, మద్దిమడుగు, ఇందిరానగర్, అడవి ప్రాంతాల్లో ఉండే జింకలు నీటికోసం తహతహలాడుతున్నాయి. గ్రామాలవైపు వచ్చి మృత్యువాత పడిన ఘటనలు అనేకం ఉన్నాయి.

● నెల రోజుల్లోనే మూడు ప్రమాదాలు

ఇటీవల వేసవి ధాటికి మంచినీటికోసం జింకలు గ్రామాలవైపు వస్తూ కేవలం నెల రోజులలోపలే మూడు ప్రమాదాలకు గురయ్యాయి. అందులో రెండు మృత్యువాత పడడం విచారకరం. మరికొన్ని కుక్కలదాడిలో గాయపడి కొన్ని తప్పించుకోగా మరికొన్ని చనిపోయిన ఘటనలు కూడా ఉన్నాయి. అటవీ అధికారులు మూగజీవాలకు తొట్లు ఏర్పాటు చేసి దాహార్తిని తీర్చాలని జంతుప్రేమికులు కోరుతున్నారు. ఇటీవల జమాల్‌పల్లి వద్ద రోడ్డు దాటుతూ గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మరో ప్రమాదంలో చెర్లోపల్లి వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మరో పొడదుప్పి మృతి చెందింది. మరో ప్రమాదంలో నీటికోసం మామిళ్లపల్లె వద్ద కొన్నేపల్లి గ్రామ సమీపంలో జింక తిరుగుతుండగా దాహం తీరకపోగా కుక్కలు వెంబడించడంతో సమీపంలోని బావిలో పడింది. గ్రామస్థులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు బావిలో నుంచి జింకను రక్షించి చికిత్స నిర్వహించి తిరిగి సమీప అడవుల్లోనే వదిలివేశారు.

● నీటి తొట్లు ఏర్పాటు చేయాలి



జింకలు ప్రమాదాలకు గురికాకుండా ఉండాలంటే సంబంధిత అధికారులు నీటి తొట్లను అక్కడక్కడ అటవీప్రాంతంలో ఏర్పాటు చేసి నీటి సదుపాయం కల్పించాలి. ఇలా చేస్తే ప్రమాదాలకు గురికాకుండా ఉంటాయి.

రామమోహన్‌రెడ్డి



చెర్లోపల్లె వద్ద రోడ్డు ప్రమాదానికి గురై మరణించిన జింక



జమాల్‌పల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించిన జింక

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

లింగాల, మే 2 (ఆంధ్రజ్యోతి): లింగాల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శేషారెడ్డి తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సివిల్, డీజల్ మెకానిక్‌కు సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 10వ తరగతి పాసై ఉండాలని పేర్కొన్నారు. ఈనెల 24లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

మహానాడు స్థల పరిశీలన

కడప ఎర్రముక్కపల్లె, మే 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27, 28, 29 తేదీలలో జరగనున్న మహానాడు కార్యక్రమానికి సంబంధించి ఆర్కే ఈవెంట్స్ ప్రతినిధులు స్థల పరిశీలన చేశారు. శుక్రవారం కడప పరిసరప్రాంతాలైన కమలాపురం, ఎన్టీఓ కాలనీ, జయరాజ్ గార్డెన్స్ సమీపంలో గల స్థలాలను పరిశీలించారు. ఏర్పాట్లకు సంబంధించి పూర్తి వివరాలు పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి మరో వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్యారమ్స్ ఉచిత శిక్షణ శిబిరం

కడప మారుతీనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): నగర డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియం, ఆ మైదానం సమీపంలో గల మున్సిపల్ ఉర్దూ పాఠశాల ఆవరణంలో ఈ నెల 3న శనివారం నుంచి ఉచితంగా క్యారమ్స్‌లో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు క్యారమ్ కోచ్‌లు, ఫిజికల్ డైరెక్టర్లు పోలంగి గణేశ్‌బాబు, ఎస్.క్రిష్ణయ్య తెలిపారు. కడప డీఎస్‌ఏ సహకారంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

కడప తాలూకా సీఐగా రెడ్డప్ప

కడప క్రైం, మే 2 (ఆంధ్రజ్యోతి): కడప నగరం తాలూకా పోలీసుస్టేషన్ సీఐగా రెడ్డప్ప శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 1996 బ్యాచ్‌కు చెందిన ఈయన ఎస్‌ఐగా జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లలో విధులు నిర్వహించారు. సీఐగా 2010లో పదోన్నతి పొందారు. సీఐగా జిల్లాలోని పలు పోలీసుస్టేషన్లతో పాటు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఇంటెలిజెన్సీ విభాగాల్లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం కడప సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన తాలూకాకు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటేశ్వర్లు వీఆర్‌కు బదిలీ అయ్యారు.

మండల అభివృద్ధే ధ్యేయం

సీకేదిన్నె, మే 2 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే ధ్యేయమని ఎంపీడీవో కుళాయిబాబు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధుల సహకారంతో మండల అభివృద్ధిని వేగవంతం చేస్తామన్నారు. వివిధ శాఖల అధికారులు, ఆయా శాఖల ప్రగతిని వివరించారు. మండల ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు,అధికారులు పాల్గొన్నారు.

రీసర్వేకి రైతులు సహకరించాలి

చెన్నూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): రెండో విడత చేపట్టిన రీసర్వేలోరైతులు సహకరించాలని అలాంటప్పుడే ఏ సమస్యలు లేకుండా సక్రమమైన రికార్డులు అందుతాయని తహసీల్దారు సరస్వతి అన్నారు .మండలంలోని కొండపేట రెవెన్యూ గ్రామంలో శుక్రవారం చేపట్టిన రెండో విడత రీసర్వేకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. ఆర్ఐ కౌశిక్, సర్వే డీటీ అర్చన, పీఆర్‌వో లక్ష్మి, సచివాలయ సర్వేయరు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మంచి భవిష్యత్తు

లింగాల, మే 2 (ఆంధ్రజ్యోతి): జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యం సాధించాలంటే క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రావణి అన్నారు. లింగాల మండలం కామసముద్రం, కమ్మవారిపల్లె గ్రామాలలోని అంగన్వాడీ సెంటర్‌లలో శుక్రవారం కిశోరి వికాసంపై కమిటీ సమావేశం నిర్వహించారు.

కార్ల అద్దాలు ధ్వంసం చేసిన ఆకతాయిలు

కడప క్రైం, మే 2 (ఆంధ్రజ్యోతి):కడప నగరం శంకరాపురంలో గురువారం రాత్రి గుర్తు తెలియని ఆకతాయిలు కార్ల అద్దాలను ధ్వంసం చేశారు. శంకరాపురానికి చెందిన వ్యక్తులకు సంబంధించి మూడు కార్లు ఖాళీ ప్రదేశంలో పార్కింగ్ చేసి పెట్టారు. గుర్తు తెలియని వ్యక్తులు కార్లకు ముందు, వెనుక అద్దాలు పగలగొట్టారు. చిన్నచౌకు పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం సీసీ పుటేజీలను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారించనున్నట్లు తెలిపారు.

కాలువ ఆక్రమణను అడ్డుకున్న తహసీల్దారు



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

సీకేదిన్నె, మే 2 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం ఊటుకూరు పొలంలో కాలువ ఆక్రమణను తహసీల్దారు నాగేశ్వరరావు అడ్డుకున్నారు. చింతకొమ్మదిన్నె మండలం ఊటుకూరు పొలంలో సర్వే నంబరు 178లో దాదాపు 30 సెంట్లు కాలువ స్థలాన్ని కొందరు ఆక్రమించి రోడ్డు వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో 'ఆంధ్రజ్యోతి' తహసీల్దారు దృష్టికి ఆక్రమణ విషయం తీసుకుపోవడంతో తహసీల్దారు నాగేశ్వరరావు వెంటనే స్పందించి ఆక్రమణ జరిగే ప్రాంతానికి అధికారులను పంపించారు. అనంతరం ఎక్స్‌కవేటర్‌ను పంపి ఆక్రమణను అడ్డుకున్నారు. కాలువ యథావిధిగా ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు.

మునిబాబుకు డాక్టరేట్

వేంపల్లె, మే 2 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ముమ్మెల మునిబాబుకు డాక్టరేట్ లభించింది. జేఎన్టీయూ అనంతపురంలో వీడియో ట్రాన్స్‌మిషన్ స్కీమ్స్‌టు ఇంప్రూవ్ క్వాలిటీ ఆఫ్ సర్వీస్ ఇన్ వైర్‌లెస్ నెట్‌వర్క్‌లో జేఎన్టీయూ అనంతపురం యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్‌అండ్ ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న ప్రొఫెసర్ పాకనాటి చెన్నారెడ్డి ,కర్నూలు జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రాచపూడి ప్రవీణ్ శ్యామ్ సంయుక్త ఆధ్వర్యంలో పీహెచ్‌డీ పూర్తిచేశారు.

అరటి రైతును ఆదుకోవాలి

వేంపల్లె, మే 2 (ఆంధ్రజ్యోతి): గాలి వానకు దెబ్బ తిన్న అరటి తోట రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నష్టపోయిన అరటి రైతులను శుక్రవారం తులసిరెడ్డి పరామర్శించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పులివెందుల కాంగ్రెస్ ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వెంట ఉన్నారు. పిడుగుపాటుకు దెబ్బ తిన్న ఎద్దలకొండ ఆలయాన్ని తులసిరెడ్డి పరిశీలించారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం..: నష్టపోయిన అరటి రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి తెలిపారు. దెబ్బతిన్న అరటి పంటలపై ఉద్యానశాఖ అధికార రెడ్డయ్యతో చర్చించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వలి, మడక శ్రీనివాసులు,దక్కా రమేష్ తదితరులుపాల్గొన్నారు.

వీఆర్‌ఏల మండల కమిటీ ఎన్నిక

చక్రాయపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా వీఆర్‌ఏల సంఘ అధ్యక్షుడు నాగేందర్, ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, జిల్లా కోశాధికారి వెంకటపతి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ ఆధ్వర్యంలో మండలం వీఆర్‌ఏల మండల నూతనకమిటీ సమావేశం చక్రాయపేటలో జరిగింది. ఈ సమావేశంలో చక్రాయపేట మండలంలోని వీఆర్‌ఏలు పాల్గొని మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడుగా జీఎల్ నరసింహులు, మండల అధ్యక్షుడు జి.పెద్దనారాయణను ఎన్నుకున్నారు.

'లాంగ్‌మార్చ్‌ను విజయవంతం చేయండి'

కడప ఎర్రముక్కపల్లె, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న లాంగ్‌మార్చ్‌ను విజయవంతం చేయాలని మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్ బాష పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరంలోని మాజీ ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లాంగ్ మార్చ్ ఆదివారం ఉదయం 9 గంటలకు గౌస్ నగర్ నుంచి ప్రారంభమై మాసాపేట సర్కిల్, పెద్ద దర్గా, శివలింగం బీడీ ఫ్యాక్టరీ, అల్మాస్‌పేట్ సర్కిల్, చిలకల బాయి, మట్టి పెద్దపులి, రెండో గాంధీ బొమ్మ, పాత వన్‌టౌన్ సర్కిల్, గోకుల లాడ్జి సర్కిల్, సెవెన్ రోడ్స్ వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం సెవెన్ రోడ్స్‌లో ముగింపు సభలో ఉంటుందని పేర్కొన్నారు. కులమతాలకతీతంగా పార్టీలకతీతంగా అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహమ్మద్ షఫీ, అజ్మతుల్లా నాయకులు దాసరి శివ ఇలియాస్, జమీల్, రహీం, అబ్దుల్లా, అక్బర్ అలీ, నందలూరు ఫయాజ్, డాక్టర అజ్గార్ అలీ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు పూర్తయ్యాక ప్రారంభిస్తే బాగుండేది

వేంపల్లె, మే 2 (ఆంధ్రజ్యోతి): గతంలో అమరావతి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రధాని నరేంద్ర మోదీ మళ్లీ రెండో సారి శంకుస్థాపన చేయడం తగదని నిర్మాణాలు పూర్తై ప్రారంభించి ఉంటే బాగుండేదని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదేళ్లుగా పురోగతి లేకపోయిందని శంకుస్థాపన చేసిన ఆనవాళ్లు కూడా లేవన్నారు. అమాయక పర్యాటకులపై ఉగ్రదాడి జరిగి పదిరోజులు కావస్తున్నా వారిని పట్టుకోలేకపోవడం శోచనీయమన్నారు.

దేవునికడప చెరువు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి



చెరువును పరిశీలిస్తున్న బీజేపీ నాయకుడు బాలక్రిష్ణయాదవ్

కడప మారుతీనగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): దేవుని కడప చెరువును ఆక్రమించుకోవాలని విశ్వ ప్రయత్నం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాల కృష్ణయాదవ్, సీనియర్ నాయకులు గోసుల శ్రీనివాసులురెడ్డి ప్రభుత్వాన్ని, కలెక్టర్‌ను కోరారు. ఆ మేరకు అన్యాక్రాంతమవుతున్న పాతకడప చెరువును శుక్రవారం బీజేపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే పాత కడప చెరువును ఆక్రమించుకునే క్రమంలో దాదాపు 300 పైచిలుకు టిప్పర్లతో గ్రావెల్ తోలకం జరిగిందన్నారు. అక్కడున్న మత్స్యశాఖకు సంబంధించిన కార్యాలయం ముందు వైపు నుంచే గ్రావెల్ యథేచ్ఛగా టిప్పర్లతో తోలుతున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం అడ్డుకునే ప్రయత్నం చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో పాత కడప చెరువు చైర్మన్ నారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కల్యాణ్, క్రిష్ణారెడ్డి, వాసు, సురేంద్రబాబు, టీడీపీ నేత శ్రీధర్ పాల్గొన్నారు.

ఏం చదువులు చెబుతున్నారు... అధ్వానంగా ఫలితాలు

వేంపల్లె మండల మీట్‌లో పలువురు ఆగ్రహం

వేంపల్లె, మే 2 (ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయలతో జిల్లా పరిషత్ బాలుర, బాలికల హైస్కూళ్లలో అన్ని వసతులు ప్రభుత్వం కల్పించింది, ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఇంత అధ్వానంగా ఎపుడూ చూడలేదు. 150 మంది ఫెయిల్ కావడం ఏమిటని జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి, ఎంపీటీసీలు, విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. వేంపల్లె మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గాయత్రి అధ్యక్షతన, ఎంపీడీఓ కుళాయమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. పరీక్ష ఫలితాలపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేయగా మెరుగైన విద్యాబోధన అందించేందుకు కృషిచేస్తామని ఎంఈఓ స్టాలిన్ తెలిపారు. వేంపల్లె మేజర్ పంచాయతీలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. సభ్యులు ప్రశ్నించగా, నూతనంగా వచ్చిన ఈఓ రామసుబ్బారెడ్డి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని, తాగునీటి సమస్యలేకుండా చూస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి రెడ్డయ్య, ఐసీడీఎస్ సీడీపీఓ సునీత, సూపర్‌వైజర్ స్వర్ణలత, ఇతర శాఖల అధికారులు, మండల ఉపాధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

ఆత్మగతిని పరమాత్మ వైపు మళ్లించాలి



సామూహిక ఉచిత ఉపనయన దృశ్యం

కడప కల్చరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆత్మగతిని పరమాత్మవైపు మళ్లించి తద్వారా సమాజహితం కోసం సత్కార్యాలను చేపట్టేలా బ్రాహ్మణ వటువుల జీవితాలలో మార్పురావాలని బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు పిడతల గోపాలకృష్ణశర్మ, బ్రాహ్మణపల్లి చంద్రమౌళిశర్మ, వారణాసి శ్రీధర్‌శర్మ సూచించారు. జగద్గురు ఆది శంకరాచార్య జయంతిని పురస్కరించుకుని కడప నగర బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆకుల వీధిలో వెలసిన శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయంలో బ్రాహ్మణ వటువులకు సామూహిక ఉచిత ఉపనయన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 21 మంది బ్రాహ్మణ వటువులు ఉపనయన కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో బ్రాహ్మణసంఘాల ప్రతినిధులు శశిధర్‌శర్మ, రుకుంతలశర్మ, జగదీష్‌స్వామి, నరసింహబట్టర్, చరణ్, డాక్టర్ గోపీనాథ్, కిశోర్ పాల్గొన్నారు. కార్యక్రమానంతరం బ్రాహ్మణులకు అల్పాహార, భోజన సదుపాయం కల్పించారు.

సోమేశ్వరస్వామి ఆలయంలో...: ఆది శంకరాచార్య జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని పలు బ్రాహ్మణ సంఘాల సారథ్యంలో శుక్రవారం స్థానిక దేవుని కడపలో వెలసిన సోమేశ్వరస్వామి (శివాలయం) ఆలయంలో సామూహిక ఉచిత ఉపనయనం నిర్వహించారు. ఇంద్రగంటి హరినారాయణశర్మ , బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు మురళీస్వామి, విజయ్‌బట్టర్, సతీష్‌స్వామి, మూర్తిస్వామి, ప్రదీప్‌స్వామి, యోగేష్, ప్రశాంత్, చైతన్యస్వామి పలువురు బ్రాహ్మణులు పాల్గొన్నారు.

గండిలో చలువపందిళ్లు, మట్టిబానలు

చక్రాయపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దర్శనానికి వచ్చే భక్తుల కోసం గండిలో సౌకర్యాలు ఏర్పాటుచేశారు. వేసవిలో గండికి వచ్చే భక్తులకు చలువపందిళ్లు ఏర్పాటుచేశారు. అలాగే మట్టి బానలు ఏర్పాటు చేశారు. అక్కడ సిబ్బందిని కూడా పెట్టి ఇబ్బందిలేకుండా చూస్తున్నారు. ప్రాంగణంలో, గుడికి వెళ్లేదారి, కల్యాణకట్టకు వెళ్లేదారి, అన్నదానానికి వెళ్లేదారి, దర్శనం అనంతరం బయటకు వచ్చేదారిలో కార్పెట్లు ఏర్పాటుచేశారు. మంగళవారం, శనివారం భారీఎత్తున గండికి వస్తారు. ఈ నేపథ్యంలో సురభి నాటక వ్యవస్థాపకులు అల్లపురెడ్డి కుటుంబీలకుల జ్ఞాపకార్థం అల్లపురెడ్డి జయచంద్రారెడ్డి దాదాపు వందకు పైబడి చెట్ల చుట్టూ ఉండే సిమెంటు కుర్చీలు వేయించారు. గండికి వచ్చే భక్తులకు శనివారం అన్నదానంతో పాటు, ఉచితంగా మజ్జిగ, ప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు.



వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు



మహబూబ్‌బీ
ఎంపీడీవో, కలసపాడు

ముఖాముఖి

కలసపాడు, మే 2 (ఆంధ్రజ్యోతి): వేసవిలో కలసపాడు మండలంలో తాగునీటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ మహబూబ్‌బీ తెలిపారు. పస్తుతం ఎక్కడా ఎ లాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ప్రశ్న: తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ప్రస్తుతానికి ఏ గ్రామంలో కూడా తాగునీటి సమస్యలేదు. బోర్లు, మోటర్లు, స్టార్టర్ల వల్ల సమస్య వస్తే తక్షణమే మరమమత్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం.

ప్రశ్న: ఏఏ స్కీంల ద్వారా నీరందిస్తున్నారు. వాటిల్లో ఎన్నిపనిచేస్తున్నాయి?

జవాబు: మండల పరిధిలో 13 గ్రామ పంచాయతీల్లో 186 డైరెక్ట్ పంపింగ్ స్కీంలు, 20 ఓవర్ హెడ్ టట్యాంకులు, 129 చేతిపంపుల ద్వారా ప్రజలకు నిరందిస్తున్నాం.

ప్రశ్న: రోజుకు ఎంతమందికి ఉపాధి పని కల్పిస్తున్నారు. పెండింగ్ బకాయిలు ఏమైనా ఉన్నాయా?

జవాబు: రోజుకు నాలుగు వేల మదికి ఉపాధి పని కల్పించాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. మార్చి 9వ తేదీ వరకు కూలి బకాయిలు వచ్చాయి.

ప్రశ్న: ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు ఎన్ని ఖాళీగా ఉన్నాయి?

జవాబు: కలసపాడు,లింగారెడ్డిపల్లె, పుల్లారెడ్డిపల్లె, చెన్నుపల్లె,మహానందిపల్లె గ్రామ పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ప్రశ్న: పశువుల తాగునీటికి ఎన్నితొట్లు మంజూరయ్యాయి? వాటిని ఎపుడు పూర్తిచేస్తారు??

జవాబు: పశువుల తాగునీటి కోసం మండలానికి 25తొట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం 8 పూర్తయ్యాయి. మిగతా వాటిని త్వరగా పూర్తిచేస్తాం.

సీఐగా రమణారెడ్డి బాధ్యతలు స్వీకరణ



మైదుకూరు రూరల్ ,మే 2(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు అర్బన్ సీఐగా కె రమణారెడ్డి శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ప్రొద్దుటూరు ఫ్యాక్షన్ జోన్ సీఐగా పనిచేస్తున్న రమణారెడ్డి మైదుకూ రుకు బదిలీపై విచ్చేశారు.

సిమెంటు ట్యాంకర్ బోల్తా డ్రైవర్‌కు గాయాలు

జమ్మలమడుగు, మే 2 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని ప్రొద్దుటూరు రోడ్డు బైపాస్ సర్కిల్‌లో శుక్రవారం ఉదయాన్నే సిమెంటు ట్యాంకర్ బోల్తాపడింది. ప్రొద్దుటూరు వైపు నుంచి దాల్మియా సిమెంటు ఫ్యాక్టరీవైపు వెళ్లాల్సిన సిమెంటు ట్యాంకర్ మలుపు వద్దకు రాగానే అక్కడున్న ఇనుప స్తంభానికి ఢీకొని పక్కనే బోల్తాపడింది. ఈ ఘటనలో ట్యాంకర్ డ్రైవర్‌కు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. సాయంత్రం క్రేన్ ద్వారా బోల్తాపడిన ట్యాంకర్‌ను పక్కకు తీశారు. ఘోరమైన రోడ్డు ప్రమాదం తప్పినట్లు స్థానికులు తెలిపారు.

పార్కింగ్ కష్టాలు తీరేదెన్నడో..?

● బద్వేలు పట్టణం మున్సిపాలిటీగా మారిన వాహనదారులకు తప్పని ఇక్కట్లు ● డివైడర్ల మధ్య పార్కింగ్ ఏర్పాటు చేయాలంటున్న జనం

బద్వేలు రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి):బద్వేలు రెవెన్యూ డివిజన్, నియోజకవర్గ కేంద్రం, మున్సిపాలిటీగా పదోన్నతి చెంది ఇంత గొప్ప పట్టణంలో పార్కింగ్ కష్టాలు ప్రజలను వేధిస్తుండడం శోచనీయం. ఇరవే వైలకు పైగా పక్కాగృహాలు, ఐదు కిలోమీటర్ల మేర విస్తరించిన పట్టణం, పట్టణ నడిబొడ్డున నుంచి నాలుగు ప్రధాన రహదారుల్లో వాణిజ్య సముదాయాలు.. ప్రభుత్వ కార్యాలయాలు.. కూరగాయల మార్కెట్, నిత్యం వాహనాల రణగొణ ధ్వనుల మధ్య ప్రజల రద్దీ, అయితే ఎక్కడా కూడా ద్విచక్రవాహనాలు నిలపడానికి పార్కింగ్ ఏర్పాటు చేయకపోవడం దారుణం. వాహనం ఎక్కడైనా ఆపి వెళితే పోలీసుల బెడద. ఇంతగా అభివృద్ధి చెందిన పట్టణంలో పార్కింగ్‌కు ఎక్కడ కూడా చోటు లేని దుస్థితి ఏర్పడడం, దానిని అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటంటే వాహనదారులు వాపోతున్నారు.



బద్వేలు నాలుగురోడ్ల కూడలి మైదుకూరు రోడ్డులో దుకాణాల ఎదుట పార్కింగ్ లేక అడ్డదిడ్డంగా నిలిపిన ద్విచక్రవాహనాలు

పోరుమామిళ్ల రోడ్డు బిజీ బిజీ

పట్టణ కూడలి నుంచి పోరుమామిళ్ల రోడ్డుకు వైపు కూరగాయల మార్కెట్, ఆర్డీవో కార్యాలయం, తహసీల్దారు కార్యాలయం, సబ్‌రిజిస్ట్రారు, వెలుగు, పంచాయతీరాజ్, రూరల్ పోలీసుస్టేషన్ భవన సముదాయాలు ఉన్నాయి. ఈ ప్రాంతాలకు తమ పనులపై ప్రజలు అధిక సంఖ్యలో వాహనాలపై వస్తుంటారు. అయితే వాహనం నిలిపేందుకు ఎక్కడా కూడా స్థలం లేకపోవడంతో వాహనాన్ని పార్కింగ్ చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడపడితే అక్కడ వాహనం నిలిపివెళితే ఇతర వాహనాలు వెళ్లేందుకు కష్టతరమవుతుంది. ఈ ప్రాంతంలో ఎక్కడా కూడా పార్కింగ్‌కు కాసింత స్థలం ఏర్పాటు చేయాలన్న ఆలోచన రాకపోవడం శోచనీయం.

భవన సముదాయాల నిర్మాణంలోనే లోపం

పట్టణంలోని నాలుగు ప్రధాన రహదారుల్లో భవనాల నిర్మాణంలోనే లోపం ఏర్పడింది. భవన నిర్మాణ సమయంలో ఎవరు కూడా తమ భవనాల ముందు పార్కింగ్ ఏర్పాటు చేయకపోవడమే నేడు ఇబ్బందిగా మారింది. భవన నిర్మాణాలన్నింటిలో వివిధ రకాల వాణిజ్య సముదాయాలు ఏర్పరచారు కానీ వాహనాల పార్కింగ్‌కు కాస్తంత స్థలం వదలలేకపోయారు. దీంతో వాణిజ్య సముదాయాల వద్దకు వచ్చే కొనుగోలుదారులు వారి వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

డివైడర్ల మధ్య పార్కింగ్ ఏర్పాటు చేయవచ్చు

పట్టణంలోని నాలుగు ప్రధాన రహదారుల్లో దాదాపు అన్ని రహదారుల్లో రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేశారు. అయితే ఎక్కడా కూడా కాసింత స్థలం వదలలేదు. అయితే డివైడర్ల మధ్యలో పెద్ద పెద్ద పట్టణాల్లో కూడా స్థలాలు వదిలి వాహనాల పార్కింగ్‌కు అవకాశం కల్పించారు. కానీ బద్వేలు పట్టణంలో మాత్రం దారి పొడవునా డివైడర్లు ఏర్పాటు చేశారు కానీ మధ్యలో స్థలం వదల్లేకపోయారు. డివైడర్ల మధ్యలో స్థలం ఏర్పాటు చేస్తే వాహనాల పార్కింగ్ చేసుకునేందుకు సౌకర్యంగా ఉంటుందని వాహనదారులు కోరుతున్నారు.

భవన నిర్మాణాల వద్ద స్థలం ఏర్పాటు లేకనే సమస్య

భవనాలు నిర్మించేటప్పుడే పార్కింగ్ స్థలాన్ని వదిలి నిర్మాణం చేపట్టకనే సమస్య ఏర్పడింది. అయితే బద్వేలు పట్టణంలో ఎక్కడా కూడా పార్కింగ్ స్థలం వదలకుండా భవనాలు నిర్మించడంతో ప్రస్తుతం వాహనాలు ఎక్కడ ఆపాలన్నా ఇబ్బందులు తప్పడంలేదు. వాణిజ్య సముదాయాలున్నవారు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసుకోని కొనుగోలుదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి

- వాకమళ్ల నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనరు, బద్వేలు

ప్రధాన మంత్రికి స్వాగతం పలికిన ఎమ్మెల్యే ఆది



జమ్మలమడుగు, మే 2 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి స్వాగతం పలికి మాట్లాడారు. అమరావతి పునఃప్రారంభానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వచ్చారు. ఆయన రాకను ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఇతర నేతలు ప్రధాన మంత్రి న రేంద్రమోదీకి ఘన స్వాగతం పలి కారు.

ఫ్యాక్షన్ గ్రామంలో నాకా బందీ



గ్రామస్థులకు సూచనలు ఇస్తున్న సీఐ శివశంకర్, ఎస్ఐ వినోద్‌కుమార్

దువ్వూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం ఫ్యాక్షన్ గ్రామమైన నారాయణపల్లిలో పోలీసులు శుక్రవారం నాకాబందీ నిర్వహించారు. మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్, ఎస్ఐ వినోద్‌కుమార్, సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో అనుమానాస్పద స్థలాల్లో కలియతిరిగారు. అసాంఘిక వస్తువులకోసం ఇళ్లు, గడ్డివాముల్లో వెతికారు. సరైన రికార్డులు లేని ఏడు వాహనాలను స్వాధీనపరచుకున్నారు. అనంతరం గ్రామస్థులను సమావేశ పరచి గ్రామాల్లో తగాదాలకు పోవద్దని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే వాటిని సామరస్యంగా పరిష్కరిస్తామని పోలీసులు తెలిపారు.

మురుగునీటితో కలుషితమవుతున్న ఉత్తర కాలువ



జమ్మలమడుగు, మే 2 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం రైతుల పంట పొలాలకు విడుదల చేసిన ఉత్తర కాలువ నీటిలో మురుగునీరు వచ్చి చేరుతోంది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జమ్మలమడుగు మండల పరిదిలోని 4వ వార్డు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన కాలువ నిర్మించక పోవడంతో పట్టణంలోని నీరు పక్కనే మురుగునీటి కాలువలో చేరి అక్కడి నుంచి ఉత్తర కాలువలో కలుస్తున్నాయి. ఆ నీటిలో డ్రైనేజీ నీరు కలుస్తుండడం వలన నీరంతా కంపుకొడుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో ఆదిశంకరాచార్యుల జయంతి



పుష్పాలంకరణలో ఆదిశంకరాచార్యులు

ప్రొద్దుటూరు టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆదిశంకరాచార్యుల జయంతిని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఉన్న ఆదిశంకరాచార్యుల ఆలయంలో స్వామివారికి ఉదయం నుంచఇ విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని కాయా కర్పూరం సమర్పించి పూజలు చేశారు.

ఘనంగా సామూహిక ఉపనయనాలు



సామూహిక ఉపనయనాలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదిశంకరాచార్యుల జయంతిని పురష్కరించుకుని బ్రాహ్మణ వటువులకు సామూహిక ఉపనయనాలను ఉచితంగా నిర్వహించారు. కడప జిల్లా అర్చక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపనయనాలులో జిల్లా వ్యాప్తంగా 25 మంది వటువులు పాల్గొన్నారు. వటువులకు పండితులు యజ్ఞోపవీత ధారణ, బ్రహ్మోపదేశం చేసి శాస్త్రోక్తంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని కుటుంబ పెద్దలు, బ్రాహ్మణ పెద్దలు ఆశీర్వదించారు.

● బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో వటువులకు సామూహిక ఉపనయన కార్యక్రమం నిర్వహించారు. దుర్భాక వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో పది మంది వటువులకు ఉపనయనాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కంబగిరిరావు, బ్రాహ్మణులు పాల్గొన్నారు.

వైభవంగా మహా మండలార్చన



మహా మండలార్చన కార్యక్రమంలో పాల్గొన్న పీఠాధిపతులు

మైదుకూరు రూరల్ ,మే 2(ఆంధ్రజ్యోతి) :స్థానిక శ్రీలక్ష్మి ఎలైట్ పార్క్‌లో శుక్రవారం మహా మండలార్చన కార్యక్రమాన్ని బీజేపీ కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వామి, ఈశ్వరీదేవి మఠం పీఠాధిపతి వీర శివకుమార్ స్వామి, తెలంగాణాకు చెందిన పీఠాధిపతి వీరధర్మజస్వామి, బనగానపల్లె పీఠాధిపతి శ్రీనివాసచార్యులు, వెంకటాద్రిస్వాములు తదితరులు పాల్గొ న్నారు. ఈ మహా మండలార్చన కార్యక్రమంలో సుమారు 80 మంది వీరబ్రహేం ద్ర స్వామి మాల దీక్ష పొందుతున్నవారు తదితరులు పాల్గొన్నారు.

అమరావతి సభకు తరలివెళ్లిన టీడీపీ నేతలు



రాజధాని అమరావతి శంకుస్థాపన సభకు వెళుతున్న టీడీపీ నేతలు

ప్రొద్దుటూరు , మే 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన సభకు ప్రొద్దుటూరు టీడీపీ నేతలు శుక్రవారం ఉదయం 6గంటలకు పట్టణంలోని మార్కెట్ యార్డు నుంచి విజయవాడకు తరలివెళ్లారు. వాహనాల్లో దాదాపు 100మంది నాయకులు కార్యకర్తలు బయలు దేరి వెళ్లా రు. గురువారం రాత్రి పది బస్సుల్లో ఈ సభకు ప్రొద్దుటూరు నుంచి టీడీపీ కార్య కర్తలు అభిమానులు డ్వాక్రా మహిళలు వెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, వాల్మీకి బోయ కార్పోరేషన్ స్టేట్ డైరెక్టర్ నల్లబో తుల నాగరాజు, టౌన్ బ్యాంకు చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, కౌన్సిలర్లు మునీర్ , వంగనూరు మురళీధర్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శంకరాపురం ప్రసాద్ రెడ్డి, రాజుపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు ధనిరెడ్డి రామచంద్రారెడ్డి, కాంట్రాక్టర్ వంగల నారాయణరెడ్డి, ఆవుల రాజేశ్వరరెడ్డి తదితరులు బయలు దేరి వెళ్లారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐ జమ్మలమడుగు, మైలవరంలలో అడ్మిషన్ల కొరకు 8వ తరగతి పాస్ లేక 10వ తరగతి ఫెయిల్, 10వ తరగతి పాసైన ఆసక్తిగల విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని జమ్మలమడుగు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ నవరూప్ కుమార్ తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో కానీ నేరుగా కళాశాల వద్ద ప్రిన్సిపాల్‌ను సంప్రదించి ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఏదేని ప్రభుత్వ ఐటీఐలో వారియొక్క ఒరిజినల్ సర్టిఫికెట్ తీసుకెళ్లి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈనెల 26వ తేదీ లోపు చేయించుకోవాలన్నారు. అలా చేయించనివారు అడ్మిషన్‌కు అర్హులు కాదన్నారు. అభ్యర్థులకు కౌన్సెలింగ్ తేది ఫోన్ కాల్ ద్వారా మొబైల్ మెసేజ్ ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. జూన్ 2వ తేదీ నుంచి 10వ తేది వరకు ప్రభుత్వ ఐటీఐ మైనార్టీ కడప నగరంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారన్నారు.. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థినీ విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

పారిశుధ్యం మెరుగునకు కృషి చేయాలి



పోట్లదుర్తిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో తిమ్మక్క

ఎర్రగుంట్ల, మే 2(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేకంగా కృషి చేయాలని జమ్మలమడుగు డీఎల్‌పీవో తిమ్మక్క పేర్కొన్నారు. ఎర్రగుంట్ల మండలంలోని పోట్లదుర్తిలో డీఎల్‌పివో తిమ్మక్క శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. వాడవాడల తిరుగుతూ ప్రజల నుంచి సేకరిస్తున్న తడిచెత్త- పొడిచెత్తపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఇంటి నుంచి తడిచెత్త-పొడి చెత్తను వేరు చేసి ఇంటి వద్దకు వచ్చిన పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలన్నారు. పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. చిలమకూరులోని చెత్త నుంచి సంపదను సృష్టించే డంపింగ్ యార్డును ఆమె పరిశీలించి వాటి వినియోగంపై అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఈవోఆర్డీ రంతుల్లయ్య, పోట్లదుర్తి సర్పంచి నరసింహులు, ఎంపీటీసీ శివప్రతాప్‌రెడ్డి, ప్రజలుపాల్గొన్నారు.

పరిచయాలు, లక్ష్యాలతో వికాసాభివృద్ధి



కిశోరి బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో అరుణకుమారి

ప్రొద్దుటూరు రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఒకరినొకరు పరిచయాలు పెంచుకుని వారు సాధించే అంశాలపై లక్ష్యాలను నిర్దేశించుకోవడం వలన మానసిక వికాసాభివృద్ధి సాధించవచ్చని ఐసీడీఎస్ సీడీపీవో అరుణకుమారి పేర్కొన్నారు. శుక్రవారం కిశోరి వికాస్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని 25 సచివాలయాల్లో అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బి.కళావతి, ఎన్.ఈశ్వరి, కె.రఫియా భాను, మహిళా పోలీసులు కిశోర బాలికలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సుబ్బరత్న, భారతి, మహిళా పోలీసు లీలావతి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటరు వెంగయ్య

బద్వేలు రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం కలుగుతుందని హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య అన్నారు. మండల పరిధిలోని తిరువెంగలాపురం హెల్త్ వెల్‌నెస్ కేంద్రంలో 10 నుంచి 19 ఏళ్ల మధ్య వయసున్న బాలికలకు పోష కాహారం, వ్యక్తగత పరిశుభ్రతపై ఆరోగ్యవిద్య ద్వారా అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం కిశోర వికాసంపై అంగన్వాడీ కేంద్రాల్లో కి శోర బాలికలను పరిచయం చేసుకుని వారి ఆహార అలవాట్లు, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత గురించి తెలుసుకుని అవగాహన కల్పిస్తున్నామ న్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసరు చంద్రావతి, హెల్త్ సూపర్‌వైజరు వెంకటమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ, ఆశాలు పాల్గొన్నారు.

కొండాపురంలో: కిశోరవికాసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండాపురం, చౌటిపల్లె అంగన్‌వాడీ సెంటర్లలో శుక్రవారం కిశోరబాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతి కిశోరబాలికలకు బాల్యవివాహాలు, వ్యక్తిగత పరిశుభ్రత, సైబర్‌భద్రత, శారీరక వ్యాయమం, లింగ అసమానత తదితర విషయాల గురించి వివరించారు. మే 2 నుంచి జూన్ 10 వరకు అంగనవాడీ కేంద్రాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిచనున్నట్లు ఆమె తెలిపారు. జూన్ 4 న కిశోరబాలికల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళాపోలీసులు, సులోచన, జ్యోతి, రామతులసి, కుమారి, తారాదేవి, వరలక్ష్మి, మౌనిక, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



కిశోరబాలికలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు అర్బన్‌లో: వేసవి సెలవులలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని అధికారులు పేర్కొన్నారు. పట్టణంలోని స్వరాజ్ నగర్ 7, 8వ సచివాలయాలలో మహిళా పోలీస్, ఏఎన్ఎం, ఆశావర్కర్, అంగన్వాడీ టీచర్లు పాల్గొని మాట్లాడుతూ మే 2 నుంచి జూన్ 10వ తేది వరకు కిశోర బాలికల వికాస కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కౌమార బాలికలు చదువుకోవడంతోపాటు ఆరో గ్యంగా ఉండటానికి తగు జాగ్రత్తలు తీసుకొవాలన్నారు.



బాలికలకు అవగహన కల్పిస్తున్న అధికారులు

కులగణనకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

ప్రొద్దుటూరు టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరి వెంకటకృష్ణయ్య యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుల గణన చేపట్టాలన్నది బీసీ కులాల కల అని, బీసీ సంఘాలు దశాబ్ధాలుగా చేసిన పోరాట ఫలితంగా కుల గణన చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కులాల వారీగా బీసీ కులాల లెక్కలు సేకరించడం వలన బీసీలకు ప్రభుత్వం కేటాయించే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు, చట్టసభల్లో బీసీల ఎంపికపై తగిన అవకాశాలు లభిస్తాయన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల తర్వాత బీసీ ప్రజల ప్రధాన సమస్యను పరిష్కరించడానికి కృషి చేసిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధాశ్రమాల ఏర్పాటు అభినందనీయం



రంగసముద్రంలో వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

పోరుమామిళ్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): రంగసముద్రం సర్పంచ్ చిత్తారవిప్రకాశ్‌రెడ్డి కొంత మంది వృద్ధులకు ఆశ్రయం కల్పించేందుకు బ్రయాన్స్ వృద్ధాశ్రమాన్ని ప్రారంభించడం అభినందనీయమని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. శుక్రవారం మదర్‌థెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యసేవలు అన్నదానం నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్నదాతలు అందరికీ దేవుడు చేదోడు వాదోడుగా ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నామన్నారు. కార్యక్రమంలో చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి, చిత్త ఆరోగ్యరాణి, చిత్త గిరి ప్రణీత్‌రెడ్డి, చిత్త అనితారెడ్డి, చిత్త ప్రజ్వలరెడ్డి, నాగార్జునరెడ్డి, ప్రముఖ వైద్యులు కళ్యాణ్ చక్రవర్తి, మాజీ మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ కల్లూరురమణారెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, పుల్లీడు,టేకూరుపేట సర్పంచ్‌లు రఘునాధరెడ్డి, కల్లూరు రమనారెడ్డి, ఆదిబోయిన కొండయ్య, హ్యూమన్‌రైట్స్ నాయకులు గంగన్న, చాపాటి నారాయణరెడ్డి, పాలకొలను రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను పంపిణీ



రామలక్షుమ్మకు పింఛను అందిస్తున్న సచివాలయ సిబ్బంది శివారెడ్డి

పోరుమామిళ్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో కాలు విరిగి మూడు నెలలు గా కడపలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్న నిరుపేదరాలుకు కొరపాటిపల్లె పంచాయతీ సర్పంచ్ కాశి లక్ష్మి సచివాలయంలో పనిచేస్తున్న శివారెడ్డి అనే వ్యక్తిని పంపి మూడు నెలలు అంద వలసిన రూ.12వేలు పింఛను అందించా రు. మండలంలోని కొరపాటిపల్లెలో నివా సం ఉండే రామలక్షుమ్మ అనే పింఛనుదా రురాలు కాలు విరిగి మూడు నెలల నుంచి కడపలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న సర్పంచ్ సొంత వాహనంలో కడపకు వెళ్లి సచివాలయ సిబ్బంది ద్వారా మూడు నెలల పింఛనుఅందించారు. సచివాలయసిబ్బందికి, ఎంపీడీవో రమణారెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.